క్లుప్తంగా

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మండల హౌసింగ్ ఏఈ సుమంత్, సిబ్బందితో కలిసి శుక్రవారం ఎంపీడీఓ కంబదహాల్ గ్రామంలో పర్యటించారు. హౌసింగ్ కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే అనుమతులు రద్దు చేయాల్సి వస్తుందన్నారు. 21 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రారంభదశలో 9, లెంటల్ లెవల్ 9, రూఫ్ లెవల్ 3 ఇళ్లు ఉన్నట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీర్ అసిస్టెంట్ లక్ష్మి, వర్క్ఇన్‌స్పెక్టర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ఇళ్ల ఎదుట నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాణ్యం: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని మద్దూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ సుబ్బారెడ్డి సూచించారు. 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగంగా పాణ్యం నాల్గవ సచివాలయ పరిధిలోని ఇంటింటికి సిబ్బందితో కలిసి వెళ్లి ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల ఎదుట, పరిసరాల్లో వర్షపు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఆ దిశగా సచివాలయాల ఏఎన్‌ఎంలు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



మారందొడ్డి రైతులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

సి.బెళగల్: సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వినూత్న అగ్రిటెక్ ఎల్ఎల్‌పీ ఎండీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పోలకల్, మారందొడ్డి గ్రామాలలో సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులను అధికంగా వాడడటంతో ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని తెలిపారు. జీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులను రెగ్యులర్ వినియోగంతో భూసారం కోల్పోయే అవకాశం ఉందన్నారు.

పంట పొలాలలో నిలిచిన వర్షపు నీరు



పర్ల గ్రామంలో పత్తి పంటలో నిలిచిన వర్షం నీరు

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటపొలాలు నీట మునిగాయి. ప్రత్యేకించి పత్తిపైరు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో ఆరువేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పొలాల్లో వర్షం నీరు నిలవడంతో చిడపీడలు, తెగుళ్ల ఆశిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పత్తి పంటలో నిలిచిన నీటిని బయటకు పంపాలని ఏఓ శ్రీనివాసరెడ్డి సూచించారు.

ఇసుక బుకింగ్ కేంద్రం వద్ద వాదులాట



సి.బెళగల్లోని ఇసుక బుకింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ఏఎస్ఐ ప్రమీల

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న గ్రామ సచివాలయం – 2 దగ్గర ఏర్పాటు చేసిన ఇసుక బుకింగ్ కేంద్రం వద్ద శుక్రవారం కొందరు వాదులాడుకున్నారు. వాహన డ్రైవర్లు, యజమానులు ఇసుక బుకింగ్ కోసం మేము ముందు వచ్చామంటూ కొందరు..కాదు మేమంటూ మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి చేయిదాటుతుందన్న విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మారెడ్డి సచివాలయం చేరుకుని అందరిని చెరగొట్టారు. మహిళా ఏఎస్ఐ ప్రమీల అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఇసుక కోసం వచ్చిన వారికి టోకన్లను అందజేసి క్యూలైన్‌లో ఏఎస్ఐ పంపించారు.

నేడు వినాయక చవితి

- ముస్తాబైన మండపాలు
- కొలువుదీరనున్న బొజ్జ గణపయ్యలు
- మూడురోజులపాటు పూజలందుకోనున్న ఏకదంతుడు
- 9వ తేదీన నిమజ్జనం



కోడుమూరులో అమ్మకానికి ఉన్న వినాయకులు

కోడుమూరు రూరల్ : వినాయక చవితి ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మండల కేంద్రం కోడుమూరుతోపాటు గ్రామాల్లోనూ మండపాలు ముస్తాబయ్యాయి. మండపాలను రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ముస్తాబైన మండపాల్లో బొజ్జగణపయ్యలు కొలువుదీరనున్నారు. దీంతో శుక్రవారం పట్టణంలో వినాయక విగ్రహాల కొనుగోళ్లు జోరుగా సాగాయి. విగ్రహం సైజు మేరకు రూ.3వేల నుంచి రూ.30వేల వరకు వ్యాపారులు ధరలు నిర్ణయించారు. వినాయక విగ్రహాల రేట్లు గతేడాది కంటే భారీగా ఉన్నాయి. అయినప్పటికీ నిర్వాహకులు పోటీపడి గణపయ్యల విగ్రహాలను కొనుగోలు చేశారు.

మండపాలకు తరలిన గణనాథులు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కూర్చొబెట్టేందుకు గణనాథులను శుక్రవారం నిర్వాహకులు భారీగా తరలించారు. ట్రాక్టర్లలో యువకులు కేరింతలు కొడతూ విగ్రహాలను తీసుకెళ్లారు. పట్టణంలో ఎక్కడ చూసినా గణనాథులను తరలిస్తున్న వాహనాలు దర్శనమిచ్చాయి. పూజకు అవసరమైన పూలు, పండ్లు, చెరుకుగడల వంటి కొనుగోలు కోసం వచ్చిన ప్రజలతో పండగ సందడి నెలకొంది.

మూడురోజుల పాటు విశేష పూజలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వాడవాడలా సుమారు 150పోట్ల గణనాథులు ఆశీనులు కానున్నారు. కొలువుదీరిన గణనాథులకు మూడు రోజుల పాటు భక్తుల నుంచి విశేష పూజలు అందుకోనున్నారు.ఈనెల 9వతేదీన సోమవారం వెంకటగిరి రోడ్డువైపు గల వినాయక ఘాట్‌లోని బావిలో నిమజ్జనం చేయనున్నట్లు ఆయా మండపాల నిర్వాహకులు తెలిపారు.

- పాణ్యం: వినాయకచవితి పండుగ పురస్కరించుకుని మండలంలో వినాయక మండపాలను నిర్వహకులు సిద్ధం చేశారు. శనివారం ప్రత్యేక పూజలు అనంతరం మండపాల్లో వినాయక విగ్రహాలు కొలువుదీరనున్నారు. ఐదు రోజుల పాటు పూజలు చేసి నిమజ్జనానికి తరలిస్తారు. ఇప్పటి వరకు మండలంలో 67 వినాయక మండపాలు ఏర్పాటు అయినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజులు నుంచి వినాయకుల విగ్రహాలను నిర్వాహకులు మండపాలకు తరలిస్తున్నారు. శుక్రవారం పెద్దఎత్తున స్వామివారి విగ్రహాలను తీసుకొచ్చారు.



కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్న భారీ వినాయక విగ్రహాలు



పాణ్యంలో ముస్తాబైన వినాయక మండపం

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- కోడుమూరు సీఐ తబ్రేజ్

కోడుమూరు రూరల్ : వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. మండలంలోని వినాయక మండపాల, శాంతి కమిటీ సభ్యులతో శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా కొలువుదీరే వినాయక విగ్రహాల మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద పెద్దపెద్ద శబ్దాల మైక్ సెట్లు, డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. ప్రజలకు ఇబందులు కలిగిస్తే సహించమని హెచ్చరించారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మండపం వద్దనే నిద్రించాలన్నారు. నిమజ్జనం సమయంలో ఒక వాహనాలు వరుస క్రమంలో ప్రశాంతంగా తీసుకెళ్లాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. ఎవ్వరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వినాయక కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోడుమూరు సీఐ తబ్రేజ్

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

కల్లూరు: పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తెలిపారు. మండల పరిధిలోని పర్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కర్నూలు మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసన్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే చురుగ్గా ఉంటారన్నారు. 108 మంది విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ, గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం పర్ల వైద్య అధికారులు డాక్టర్ సాయి కీర్తి, డాక్టర్ లక్ష్మి శైలజ, లెక్చరర్ సురేష్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, హెచ్ఎం సత్యనారాయణ, సూపర్‌వైజర్ సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాణ్యం: మండ పరిధిలోని భూపనపాడు గ్రామంలో పేకాటాడుతున్న ఎనిమిందిని అరెస్టు చేసినట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లి జూదరులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. పేకాటరాయుళ్ల నుంచి రూ. 23420 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొణిదేడు, నెరవాడ నంద్యాల, భూపానపాడు గ్రామానికి చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కల్లూరు: ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన బస్తిపాడు గ్రామంలోని ప్రభుత్వ హౌసింగ్ లేవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఎంపీడీఓ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిందు భార్గవి, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయుడు మా స్కూల్‌కు వద్దు

- ప్రస్తుత టీచర్‌నే కొనసాగించాలి
- ఎంఈఓ కార్యాలయం ఎదుట బైన్‌దొడ్డి వాసుల ధర్నా



కోడుమూరు ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బైన్‌దొడ్డి గ్రామస్తులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్ : సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడు మా స్కూల్‌కు వద్దంటూ శుక్రవారం కోడుమూరు ఎంఈఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి బైన్‌దొడ్డి గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడారు. బైన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయునులు ఏడాదిగా సక్రమంగా పనిచేస్తున్నారని, అనవసరంగా బదిలీ చేయాల్సిన అవసరం ఎంఈఓకు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దేవనకొండ మండలంలో ఆరోపణలతో సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడిని ఇక్కడికి డెప్యూటేషన్ పేరుతో నియమించాలనుకోవడం సమంజసం కాదన్నారు. తమ బాలికల భద్రత దృష్ట్యా ఆ ఉపాధ్యాయుడు తమ పాఠశాలకు వద్దని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇక్కడి ఎంఈఓ మాత్రం తమ పట్టువీడకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎంఈఓ అర్థం చేసుకుని ఉన్న టీచర్‌లనే కొనసాగించాలని, లేని పక్షంలో మా పిల్లలను బడికి పంపకుండా అపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బైన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ బాలకృష్ణ, గ్రామస్తులు నరసింహ, వీరేంద్ర, చిన్న హనుమంతు, నాయుడు, దస్తగిరి, రాజు, మిన్నెల్ల, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ స్థాపనకు మిశ్రమ స్పందన

- ఓర్వకల్లులో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య ప్రజాభిప్రాయ సేకరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ నవ్య



పాల్గొన్న ఎన్‌జీఓ సంఘాలు, గ్రామ ప్రజలు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు సమీపంలో క్వార్జ్ పరిశ్రమ ఏర్పాటుపై మిశ్రమ స్పందన వచ్చింది. షిరిడీ సాయి ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ స్థాపనపై శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జేసీ నవ్య, ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతో గ్రామాభివృద్ధితో పాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. షిరిడీ సాయి ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపినీ ప్రతినిధులు 2022లో క్వార్జ్ పరిశ్రమ ఏర్పాటుకు సర్వే నంబర్ 533/పి, 535/2ఎ1లో 8.486హెక్టార్లు(దాదాపు 182 ఎకరాల)లో ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రతిపాదనలో పేర్కొన్నట్లు తెలిపారు. పరిశ్రమ స్థాపనతో గ్రామాభివృద్ధికి సీఎస్ఆర్ కింద రూ.6 లక్షలు, డీఎంఎఫ్ ద్వారా రూ.4 లక్షల చొప్పున రూ.10 లక్షలు కేటాయించడం జరుగుతుందన్నారు. స్థాపించనున్న పరిశ్రమ నుంచి ఏడాదికి 76,725 టన్నుల క్వార్జ్ ఉత్పత్తి లక్ష్యం పెట్టుకున్నారని వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు లోబడి పనులు చేపట్టేందుకు కంపెనీ ప్రతినిధులు అంగీకరించినట్లు ఈ సందర్భంగా జేసీ గుర్తు చేశారు. అయితే కంపెనీ స్థాపనకు ఎన్‌జీఓ సంఘాలు సానుకూలంగా స్పందించగా, స్థానిక ప్రజలు పంట పొలాలు, నివాసాలు ఉన్నందున భవిష్యత్‌లో ప్రమాదాలు వాటిల్లే అవకాశాలు వున్నాయన్నారు. అందుకు నష్టపరిహారం చెల్లిస్తామని కంపెనీ వారు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, గ్రామ రైతులు లక్ష్మికాంతారెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రం కోడుమూరులోని నాలుగు, ఐదు గ్రామసచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను ఎంపీడీఓ పరిశీలించారు. కొందరు సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు వచ్చి మధ్యలో వెళ్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. కార్యాలయ వేళల్లో ఖచ్చితంగా సచివాలయంలోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడికైనా వెళ్తే మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయాలని ఎంపీడీఓ సూచించారు.

ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీకి మెమో

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ సతీష్‌కుమార్, సీఎస్ఈ ఫ్యాకల్టీ శ్వేత ప్రియకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు మెమో జారీ చేశారు. సీఎస్ఈ ఫ్యాకల్టీ శ్వేత ప్రియ అనుమతి లేకుండా కాలేజీకి హాజరు కాకపోవడంతో మెమో ఇచ్చారు. తరగతులు రెగ్యులర్‌గా జరిగేలా పర్యవేక్షణ చేయకపోవడం, ఇంజినీరింగ్ విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉండటంతో సీఎస్ఈ హెచ్ఓడీ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ హరిప్రసాద్ రెడ్డి నుంచి వివరణ కోరినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన వర్సిటీ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేయగా ఈ విషయాలు వెలుగు చూశాయని, ఆయన ఆదేశాల మేరకు మెమో జారీ చేసినట్లు రిజిస్ట్రార్ చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నగర కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో 52 వార్డుల్లో చెత్త సేకరిస్తున్న వారికి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఆ సంఘం నాయకులు విజయ రామాంజనేయులు, మహమూద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ ఆక్రమణలను తొలగించాలి

కర్నూలు(న్యూసిటీ) : హంద్రీనది ఆక్రమణలతో కర్నూలు నగరానికి వరద ముప్పు పొంచిఉందని రాయలసీమ యువజన విద్యార్థి సంఘాల నాయకులు వీవీ నాయుడు, కురువ సుంకన్న, రంగముని, కృష్ణానాయక్ స్పష్టం చేశారు. వారు శుక్రవారం హంద్రీనది ఆక్రమణలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ విజయవాడలో వరదలకు లక్షల మంది పేదలు నిలువ నీడలేకుండా నష్టపోయారన్నారు. ఇలాంటి పరిస్థితి కర్నూలు నగరానికి రాకుండా హంద్రీనదిలో ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.

సోలార్ పరిశ్రమను అడ్డుకుంటాం



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఆందోళనకారులు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ పరిసరాల్లో స్థాపించనున్న సోలార్ పరిశ్రమను అడ్డుకుంటామని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ గ్రామ రైతులు నిర్వహించిన ఆందోళనకు ఏపీ రైతు సంఘం నాయకులు మద్దతుగా నిలిచారు. ఉయ్యాలవాడ రైతులు అధిక సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. 'సోలార్ వద్దు..వ్యవసాయమే ముద్దు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామ పరిసరాల్లోని దాదాపు 2,600 ఎకరాలలో గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో సోలార్ పరిశ్రమను నెలకొల్పేందుకు ప్రాథమిక సర్వే చేయాలనే ప్రయత్నాలు దారుణమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎక్కడైనా పరిశ్రమ స్థాపించాలంటే 75 శాతం మంది రైతులు ఆమోదం తప్పనిసరి అన్నారు. రైతుల ఆమోదం లేకుండా సోలార్ పరిశ్రమను స్థాపించే హక్కు ఎవ్వరిచ్చారని ఆయన ప్రశ్నించారు. సారవంతమైన భూముల్లో పరిశ్రమల ఏర్పాటు ఏ మాత్రం సమంజసం కాదని హెచ్చరించారు. మామిడి తోటలు, కొబ్బరి తోటలు, ఇతర పండ్ల తోటలతో సస్యశ్యామలంగా పండిస్తున్న పొలాల్లో పరిశ్రమల స్థాపన ఎంతవరకు సమంజసమని ఆయన ధ్వజమెత్తారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని శకునాల, గని గ్రామాల మధ్య సుమారు 5 వేల ఎకరాలలో సోలార్ పరిశ్రమను స్థాపించడం జరిగిందన్నారు. భూములు కోల్పయిన రైతులకు టీడీపీ ప్రభుత్వం నామమాత్రపు పరిహారం చెల్లించి చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకుడు నాగన్న, గ్రామ రైతులు మమబూబ్‌బాషా, రామకృష్ణ, ఎల్లరాముడు, నెరిగల రమణ, సూరీడు, సర్దార్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడి.. బోధన తడబడి

- నేటికీ సరఫరాకాని పాఠ్య పుస్తకాలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులు (ఫైల్)

గడివేముల: అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కేంద్రాలు తెరచి నెలలు కావస్తున్నా పాఠ్య పుస్తకాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. పాత పుస్తకాలతోనే బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. బాల్య దశలో విజ్ఞానం పెంపొందించించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టింది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మల పుస్తకాలు కేంద్రాలకు అందజేసేది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్–1, బర్డ్స్–2 కిట్లను అందించింది గత ప్రభుత్వం. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా ఇంగ్లిషులో పాఠాలు బోధించడంతో కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. బోధనలకు సంబంధించి రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్ సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్లు అందజేసేవారు. నాలుగు, ఐదేళ్ల వయసు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో టీడీపీ కూటమి ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు చిన్నారుల తల్లిదండ్రులు.

పాత పుస్తకాలతోనే బోధన....

టీడీపీ ప్రభుత్వంలో పాఠ్యపుస్తకాల పంపిణీ ఊసే లేకుండా పోయింది. పాత పుస్తకాలతోనే బోధన 49 అంగన్వాడీ కేంద్రాలలో సాగిస్తున్నారు టీచర్లు. మూడు నుంచి ఆరేళ్లలోపు 1,374 మంది చిన్నారులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినప్పటికీ అంగన్వాడీ కేంద్రాల వైపు దృష్టి సారించలేదు. కేంద్రాలకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలు అందకపోవడంతో వర్కర్లు పాత పుస్తకాలతోనే బోధిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త పుస్తకాలను అందించకపోవడంతో తమ చిన్నారులను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలని ఆలోచిస్తున్నారు తల్లిదండ్రులు.

త్వరలో పుస్తకాలు వస్తాయి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యాభ్యాసానికి ఎలాంటి డోకా లేదు. ప్రస్తుతం తమ వద్ద ఉన్న పాఠ్యపుస్తకాల విద్యా బోధనకు సరిపోతున్నాయి. త్వరలో కొత్త పాఠ్య పుస్తకాలు కూడా వస్తాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన విధానాన్ని ప్రతిరోజు టైమ్ టేబుల్ వేసి అన్ని కేంద్రాలకు పంపిస్తున్నాం. అంగన్‌వాడీ వర్కర్లు చిన్నారులకు పాఠాలు, ఆటల ద్వారా విద్యను సక్రమంగా బోధిస్తున్నారు.

– చంద్రకళ, సీడీపీఓ, నంద్యాల జిల్లా

పందులను వదిలితే కేసులు

కర్నూలు (టౌన్): నగరంలో పందులు రోడ్లపైకి వదిలితే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో రోడ్లపై పందులు యథేచ్ఛగా తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.